క్లుప్తంగా

నాగోబా ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న జాన్సన్ నాయక్, తదితరులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు బుక్యా జాన్సన్‌నాయక్ మంగళవారం పూజలు చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. మెస్రం వంశీయులు ఆయన్ను సన్మానించారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జిలానిబేగ్, మెస్రం వంశీయులు మెస్రం ఆనంద్‌రావ్, నాయకులు తహరే గణేశ్, రాథోడ్ మోహన్‌నాయక్, ఇర్షాద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా భీమన్న పండుగ



మొక్కు చెల్లించుకుంటున్న ముదిరాజ్‌లు

సిరికొండ: మండల కేంద్రంలోని భీమన్న పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కు చెల్లించుకున్నారు. గ్రామంలో పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. వీరితోపాటు వడ్డెర సంఘం, ఎస్సీ సంఘం వారు గ్రామదేవతలకు మొక్కు చెల్లించుకున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌అర్బన్: దశాబ్ది ఉత్సవాల్లోనైనా పెన్షనర్ల సమస్యలు పష్కరించాలని ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.శశికాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొని మాట్లాడారు. పెండింగ్ డీఏల విడుదల, పేరివిజన్ కమిటీ ఏర్పాటు, నగదు రహిత వైద్యం అందించడంలో, మొదటి తేదీన పెన్షన్ పొందే పరిస్థితి లేదని వాపోయారు. రిటైర్డ్ అయిన రోజే రావల్సిన ప్రయోజనాలన్నీ ఏక మొత్తంలో అదే రోజున ఇచ్చి గౌరవంగా పంపించాలని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని అన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్, ఎన్.దయాకర్‌రెడ్డి, ఎం.గంగాధర్, ఏ.సత్యనారాయణ, అశోక్ వైద్య, దేవిదాస్, ఎస్.రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సావరి బంగ్లాకు భూమిపూజ

సిరికొండ: మండలంలోని సోన్‌పెల్లి పంచాయతీ పరిధిలోని దోబిగూడలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మంగళవారం సావరి బంగ్లా నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సూర్యకాంత్, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

12న తెలంగాణ రన్

ఆదిలాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ, యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రన్ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల సభ్యులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్జీవో, యువజన సంఘాలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ సిటిజన్లు, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సన్మానం

బోథ్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంఘం సభలో మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిచెల్మ ప్రవీణ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్ సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు.

బీజేపీకి రాజీనామా

బోథ్: బీజేపీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాయిసిడాం ఇస్రు ప్రకటించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిష్టానం నుంచి వచ్చిన సమాచారాన్ని తమకు చేరవేయడం లేదని అన్నారు. ఆదివాసీలను చిన్న చూపు చూస్తున్నారని, అందుకే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌కు రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో వసతులు కరువు

- అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ
- ఇరుకు గదులతో అవస్థలు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు



మాన్యాపూర్ అంగన్‌వాడీ కేంద్రం భవనం



పైకప్పు నుంచి పెచులూడి శిథిలావస్థలో ఉన్న భవనం

నార్నూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. టీచర్లు ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో కేంద్రాలను నడుపుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇరుకు గదులతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఆటపాటలు లేక డీలా పడిపోతున్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని అంగన్‌వాడీ టీచర్లతోపాటు చిన్నారుల తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటున్నారు. నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలం వ్యాప్తంగా 154 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 103 ప్రధాన కేంద్రాలు కాగా, 51 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇక వీటిలో 36 సొంత భవనాలు, 70 అంగన్‌వాడీ కేంద్రాలు కిరాయి ఇళ్లలో నిర్వహిస్తున్నారు. 48 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం ప్రభుత్వ కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాలల తదితర వాటిలో కొనసాగుతున్నాయి. కొన్ని అంగన్‌వాడీలకు నిధులు మంజూరైనా రెండేళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఉమ్మడి మండలంలో దాదాపు 15పైగా అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి.

శిథిలావస్థలో మాన్యాపూర్ కేంద్రం..

నార్నూర్ మండలం మాన్యాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 40 మంది చిన్నారులు, ఐదుగురు గర్భిణులు ఉన్నారు. ప్రతిరోజు చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధనలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతోందనని అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. గతవారం క్రితం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీచర్ కమలబాయి ఆటపాటలతో విద్యాబోధనలు చేస్తున్నారు. అనుకోకుండా భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి కిందపడింది. చిన్నారులకు ప్రమాదం తప్పింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చిన్నపాటి చినుకుపడిన గదులకు నీరు వచ్చి నిలుస్తాయని అంగన్‌వాడీ టీచర్ అంటున్నారు. కనీసం కూర్చోవడానికి జాగా ఉండక ఇబ్బంది అవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనానికి మరమ్మతు లేదా నూతన భవనాన్ని మంజూరు చేసి చిన్నారుల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయంగా ఉంది



భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఎప్పుడేం జరుగుతోందనని భయంగా ఉంది. భవనంలో చిన్నారులను కూర్చోబెట్టాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వర్షం కురిస్తే నీరు నిలుస్తుంది. అధికారులు నూతన భవనం మంజూరు చేయాలి.

– కమలాబాయి, అంగన్‌వాడీ టీచర్, మాన్యాపూర్

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ఇంద్రవెల్లి: పోల్లుగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



బోథ్: కనుగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్/తాంసి/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో ప్రచారం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, అందుతున్న విద్యపై వివరించారు. ఇంద్రవెల్లి మండలంలోని వడగామ్, పాటగూడ, మామిడిగూడ, గోండ్‌గూడ తదితర గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. ఉట్నూర్ మండలంలోని యేంక, సద్దంగూడ, నాగాపూర్, వడోని గ్రామాల్లో 22 మంది పిల్లల వివరాలు సేకరించారు. భీంపూర్ మండలం నిసానిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. 26 మంది విద్యార్థులను 9వ తరగతిలో చేర్చుకున్నారు. బండల్‌నాగాపూర్‌లో 10 మంది విద్యార్థులకు పాఠశాలలో చేర్చుకొని ప్రవేశ పత్రాలను అందించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘కౌలు రైతులను పట్టించుకోని ప్రభుత్వం’

ఎదులాపురం: కౌలు రైతులను ప్రభుత్వం పట్టించుకోడం లేదని, వారి హక్కుల కోసం రైతు స్వరాజ్య వేదిక పోరాడుతోందని ఆ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు విస్సా కిరణ్ అన్నారు. కౌలు రైతుల స్థితిగతులపై రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహకారం అందడం లేదన్నారు. వ్యవసాయ రంగంలో దాదాపు 35స్వరాజ్య వేదిక శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నట్లు తమ అధ్యయనంలో తేలిందన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిబంధనలు ఉన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదన్నారు. దాని కారణంగా పంట వేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందడం లేదన్నారు. పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతు కాకుండా భూ యజమానికి పరిహారం అందుతుందన్నారు. దీనిపై జూలైలో హైదరాబాద్ కేంద్రంగా కౌలు రైతులతో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, రైతు సంఘం జిల్లా నాయకులు దత్తాత్రి పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందజేస్తున్నామని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో 21 మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయంలో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, తదితర పథకాలతో అర్హులు లబ్ధిపొందుతున్నారని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తహసీల్దార్ రాథోడ్ మోహన్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామరావు, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ ప్రకాశ్, ముస్తాఫ, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దశాబ్ది సంపద వనాలకు స్థల పరిశీలన



కోర్ట–చనాఖా బ్యారేజీ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్, అధికారులు

జైనథ్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద నిర్మించ తలపెట్టిన సంపద వనాల కోసం మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. డీఆర్డీవో కిషన్, అధికారులతో కలిసి మండలంలోని కోర్ట–చనాఖా బ్యారేజీ, లక్ష్మీపూర్ రిజర్వాయర్, సాత్నాల ప్రాజెక్టుల వద్ద స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ ప్రాజెక్టుల వద్ద ఎంపిక చేసిన స్థలాల్లో మొక్కలు పెంచాలన్నారు. ఆయన వెంట అడిషనల్ డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఎంపీడీవో గజానన్, పీఆర్ ఏఈ మహావీర్, అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



రిమ్స్ డైరెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న రాజు

నేరడిగొండ: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని బుగ్గారం(కె) ఎంపీపీఎస్ పాఠశాలకు ఓ విద్యా వలంటీర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈనెల 11 వరకు స్థానికంగా ఉండే వారిని ఎంపిక చేసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌కు సూచించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను రాజ్‌కుమార్ మంగళవారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలకు వీవీ నియమించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందిస్తానని డైరెక్టర్ చెప్పడం సంతోషంగా ఉందన్నారు.

‘డబుల్’ అర్హుల జాబితా ప్రకటన

- ఐదు రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి సంబంధించి రెండోవిడత అర్హుల జాబితాను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు మంగళవారం ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 38, 39, 40, 41, 3,4, 17, 15 వార్డులకు సంబంధించి అర్హులైన వారి జాబితాను మున్సిపల్ కార్యాలయ నోటీస్‌బోర్డుపై ఉంచినట్లు పేర్కొన్నారు. విలీన గ్రామ పంచాయతీ వార్డుల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ జాబితాను పరిశీలించి ఐదు రోజుల్లోగా తమ అభ్యంతరాలను మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల తహసీల్దార్లకు అందజేయాలని ఆమె సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నేరడిగొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లు లేని అర్హులైన వారిని గుర్తించి ఇల్లు కట్టుకోవడానికి స్థలాలు పంపిణీ చేస్తామని తెలిపారు. నిరుపేదలు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు 412 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఆర్ఐ నాగరాజ్, పంచాయతి కార్యదర్శి రాఘవేంద్ర, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్‌సింగ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

తాంసి: తాంసి ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని అధ్యాపకులు పేర్కొన్నారు. తలమడుగు మండలం కుచులాపూర్, లింగి, తాంసి మండలం కప్పర్ల, పొన్నారి గ్రామాల్లో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి మంగళవారం ప్రచారం చేపట్టారు. కళాశాలలో విద్యాబోధన, అక్కడి వసతుల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. అధ్యాపకులు రమణారెడ్డి, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు శివర్ధన్, దేవేందర్, అనుపమ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో సౌకర్యాలేవి?

- వెలగని విద్యుత్ దీపాలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- పంటలకు రక్షణ కరువు
- చీకట్లో పంటల వద్ద రైతుల నిరీక్షణ



గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన రైతు ప్రహ్లాద్. గత మూడు రోజుల క్రితం ఇచ్చోడ మార్కెట్ యార్డుకు 75 క్వింటాళ్ల జొన్న పంట విక్రయించడానికి తీసుకువచ్చాడు. రాత్రివేళలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చిమ్మచీకట్లోనే పంట వద్ద ఉండి నిరీక్షిస్తున్నాడు.



మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న జొన్న పంట



యార్డులో పనిచేయని సీసీ కెమెరాలు

ఇచ్చోడ: వ్యవసాయ మార్కెట్‌యార్డులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. యార్డులో గత రెండునెలల నుంచి మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల రైతులు పండించిన పంటలను విక్రయించడానికి మార్కెట్ యార్డుకు వస్తున్నారు. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో పంటలు అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. యార్డులో గత కొన్నినెలలుగా రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేవు. ఇక్కడ నిల్వ ఉంచిన పంటల కోసం రైతులు చిమ్మ చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిల్వ ఉన్న పంటలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు రైతులు వాపోతున్నారు.

నెల వ్యవధిలో ఐదు పశువులు మృతి..

మార్కెట్ యార్డులో ఉన్న ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వర్షాలకు ఇనుప స్తంభాలకు షార్ట్ సర్క్యూట్ కావడంతో నెల వ్యవధిలో ఐదు పశువులు మృత్యువాతపడ్డాయి. ప్రతిరోజు వందలాది రైతులు, హమాలీలు వస్తూ వెళ్తుంటారు. ప్రమాదం జరగకముందే ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే, మార్కెట్ కార్యదర్శి గత కొంత కాలంగా స్థానికంగా ఉండడంలేదు. కుమురం భీం జిల్లా నుంచి వారానికోకసారి రాకపోకలు సాగిస్తుంటారని విమర్శలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

మార్కెట్ కార్యదర్శి స్థానికంగా ఉండకపోతే చర్యలు తీసుకుంటాం. రైతులకు సౌకర్యాలు కల్పించేలా చూస్తాం. షార్ట్ సర్క్యూట్‌తో పశువుల చనిపోయినట్లు నా దృష్టికి వచ్చింది.

– శ్రీనివాస్, జిల్లా మార్కెట్‌శాఖ అధికారి



సొనాలలో ఆత్మీయ సమ్మేళనం

బోథ్: మండలంలోని సొనాల జెడ్పీ హైస్కూల్‌లో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివినవారంతా ఇదే గ్రామంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు.

పార్టీ పటిష్టతకు ఐక్యంగా కృషి చేయాలి

ఇచ్చోడ: పార్టీ పటిష్టతకు కృషి చేయాలని డీసీసీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ‘లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్’ కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు కాంగ్రెస్‌ను గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను గడపగడపకూ చేర్చాలని కోరా రు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పసుల చంటి, నాయకులు నరేశ్‌జాదవ్, అడే గజేందర్, కుమరం కోటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్‌ఖాన్, పార్టీ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

నేరడిగొండ: విద్యార్థులు చదువుల్లో మరింతగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శబానా తరన్నుమ్ అన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్న రాథోడ్ బల్‌దార్, కోవ సునీల్‌ను మంగళవారం కళాశాలలో సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పర్చుకొని వాటి సాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఉన్నారు.

గర్భిణులకు సీమంతం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రం–7లో మంగళవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పూలు, పండ్లు, చీరలు అందజేసి సీమంతం జరిపారు. సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ గౌరిరాణి, సూర్యకుమారి, ఏఎన్ఎం మౌనిక పాల్గొన్నారు.

8 వరకు జొన్న కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ యార్డుకు జొన్నపంట అధిక మొత్తంలో రావడం వల్ల ఈనెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. తిరిగి 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన కోరారు.

నేడు తాంసిలో..

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో కొనసాగుతున్న జొన్న కొనుగోళ్లను బుధవారం తాత్కాలికంగా నిలిపివేసినట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. గన్నీ సంచుల కొరత కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తాంసి, భీంపూర్ మండలాల రైతులు గమనించాలని కోరారు.